సాక్షి మహబూబాబాద్

గురువారం । 23 । జనవరి । 2025



విద్యతోనే సమాజంలో గుర్తింపు

విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు.

- 8లో▸



మిలిటరీ వ్యూహాల్లో టెక్నాలజీ కీలకం

మిలిటరీ వ్యూహాల్లో కంప్యూటర్ టెక్నాలజీ కీలక భూమిక వహిస్తుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
36.9^0/13.8^0

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు పడుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి వేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు మిర్చి కొనుగోళ్లు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 24న కొత్త మిర్చి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి షంషీర్ బుధవారం తెలిపారు. రైతులు గమనించి తమ సరుకును ఉదయం 8 గంటలలోపు మార్కెట్ యార్డుకు తీసుకురావాలని పేర్కొన్నారు.

కమ్యూనిస్టులతోనే పేదల సమస్యల పరిష్కారం



తొర్రూరు: కమ్యూనిస్టులతోనే పేదల సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయ్‌సారథి అన్నారు. డివిజన్ కేంద్రంలో బుధవారం సీపీఐ మండల సమితి సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావుతో కలిసి విజయ్‌సారథి మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమాలకు ప్రజలు మద్దతు తెలపాలన్నారు. ఈ నెల 25న మహబూబాబాద్‌లో జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పాల్గొనే సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యుడు ఓమ భిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, నాయకులు కిరణ్‌కుమార్, యాదగిరి, శ్యామ్, వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి




తొర్రూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందుంటానని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా డివిజన్ కేంద్రంలోని పలు వార్డుల్లో పీఆర్‌టీయూ నాయకులతో కలిసి శ్రీపాల్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మిరియాల సతీష్‌రెడ్డితో కలిసి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ...ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యలపై మండలిలో గళమెత్తుతానని తెలిపారు. పీఆర్సీ సాధన, ఉద్యోగుల వయోపరిమితి సడలింపులో ప్రభుత్వంతో మాట్లాడి సంఘం తరపున విజయం సాధించామని గుర్తు చేశారు. డీఏ బకాయిలు వచ్చేలా, సీపీఎస్ రద్దు చేసేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు విప్లవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పులి ముత్తిలింగం, నాయకులు గంగిశెట్టి రమేశ్, సురేష్‌కుమార్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పూర్ణచందర్, శ్రీధర్, లింగమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి



బయ్యారం: ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తన వంతు కృషి చేస్తున్నానని, మళ్లీ అవకాశం ఇస్తే మిగిలిన సమస్యలు పరిష్కరిస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని బయ్యారం బాలుర, బాలికోన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో బుధవారం ఆయన ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు యాకూబ్, భద్రునాయక్, బాలునాయక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి దహనం



వరంగల్ క్రైం: తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న గంజాయిని కాజీపేట మండలం అమ్మవారిపేట శివారు ప్రాంతంలో పోలీసులు బుధవారం దహనం చేశారు. 32 కేసుల్లో రూ.2.1 కోట్ల విలువైన 807 కిలోల గంజాయిని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో కాకతీయ మెడిక్లీన్ సర్వీస్ వద్ద దహనం చేశారు.

సైబర్ వల.. చిక్కితే విలవిల

జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న మోసాలు

	సంవత్సరం 2021-23	సంవత్సరం 2024
నమోదైన కేసులు	253	688
పోగొట్టుకున్న మొత్తం రూ.	73,42,849	1,24,06,315
కేసుల పరిష్కారం	66	143
పోలీసుల రికవరీ రూ.	14,51,809	56,86,805

కోర్టు ఆదేశాలు



మరో 141 మంది సైబర్ బాధితులకు సంబంధించి రూ.67,19,510 నగదును వారి ఖాతాల్లో జమ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.



- జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు పార్ట్ టైం ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో అతడి మొబైల్‌కు ఒకరోజు పార్ట్ టైం ఉద్యోగం కావాలా అని లింక్ రూపంలో మెసేజ్ వచ్చింది. వెంటనే తన సెల్ ఫోన్‌కు వచ్చిన లింక్‌పై క్లిక్ చేయగానే కొంత అమౌంట్‌తో పెట్టుబడి పెట్టాలని సూచించారు. ఈమేరకు మొదట రూ.900 పెట్టుబడి పెట్టాడు. ఇలా రూ.5,52,620 వరకు పెట్టుబడి పెట్టాడు. అయితే డబ్బులు తిరిగి రాకపోవడంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు ఆందోళన చెంది 1930కి ఫిర్యాదు చేయడంతో పాటు మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశాడు.
- జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి బ్యాంకు నుంచి అంటూ ఫోన్ చేశారు. ఈ క్రమంలో అవతలి వ్యక్తి పంపిన స్కానర్ చూస్తూ సదరు వ్యక్తి తన ఫోన్‌పే పాస్‌వర్డు కొట్టగానే బ్యాంకు ఖాతాలోని రూ.లక్ష డెబిట్ అయ్యాయి. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించగా సైబర్ క్రైమ్ నంబర్ 1930కి ఫిర్యాదు చేయమని చెప్పారు. అయితే అతడు ఫిర్యాదు చేయకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

మహబూబాబాద్ రూరల్:

- ఆశ చూపి.. ఖాతా ఖాళీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- గంటలోపు ఫిర్యాదు చేస్తేనే ఫలితం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త మోసానికి తెర లేపుతున్నారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన పెరిగినప్పటికీ.. నేరగాళ్లు ఎప్పటికప్పుడు సరికొత్త పంథాలో వల వేస్తున్నారు. పార్ట్‌టైం ఉద్యోగాల పేరిట నకిలీ లింకులు పంపుతూ ఉన్నది ఊడ్చేస్తున్నారు. లింకులపై నొక్కిన తర్వాత ఆన్‌లైన్ పేమెంట్ పేరిట బ్యాంకు ఖాతా, వ్యక్తిగత వివరాలు సేకరించి అందినకాడికి దోచుకుంటున్నారు. ఉద్యోగులు, విద్యావంతులు, వైద్యులను టార్గెట్ చేస్తూ, అధిక లాభాల పేరుతో బురిడీ కొట్టించి ఒక్కొక్కరితో సాధ్యమైతే భారీగా పెట్టుబడి పెట్టిస్తూ ఆ డబ్బును వెంటనే క్రిప్టోలోకి మార్చుతున్నారు. ఆ పెట్టుబడికి భారీ లాభం వచ్చినట్లు చూపుతున్నారు. ఆ సొమ్మును డ్రా చేసుకునేందుకు కొత్త టార్గెట్లు విధిస్తుండగా డబ్బులు పెట్టుబడి పెట్టిన బాధితులు మోసపోయిన సందర్భాల్లో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

పంథా మార్చి..

గతంలో సైబర్ నేరగాళ్లు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని నమ్మించి ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా, పిన్ నంబర్ తెలుసుకుని మోసం చేసేవారు. మీ ఏటీఎం గడువు ముగిసిందని, కొత్తది తీసుకోవాలని బ్యాంకు సమాచారం సేకరించి ఖాతాలో ఉన్న డబ్బును క్షణాల్లో మాయం చేసేవారు. ఇప్పుడు అందరూ స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నందున స్మార్ట్‌గా మోసం చేస్తున్నారు. వాట్సాప్ ద్వారా క్యూఆర్ కోడ్, లింకులు, స్కానర్ ఫొటోలు పంపించి మీరు లాటరీ గెలిచారని నమ్మబలికి డబ్బులు కాజేస్తున్నారు.

గంటలోపు ఫిర్యాదు చేస్తే..



సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లుగా గుర్తించిన గంటలోపు ఫిర్యాదు చేయడం వల్ల బాధితులకు మేలు జరుగుతుందని పోలీసులు వివరిస్తున్నారు. ఇటీవల కాలంలో రోజుకో రకం సైబర్ మోసాలు వెలుగు చూస్తున్నాయని, సులభంగా డబ్బు సంపాదించేందుకు కొందరు కేటుగాళ్లు మోసాల బాట పడుతున్నారని, ఆన్‌లైన్‌లో అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవడం కంటే అప్రమత్తంగా ఉండడం ముఖ్యమని ప్రచారం చేస్తున్నారు. మోసానికి గురైన వెంటనే 1930 కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని, సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలకు డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్ చేసే అవకాశాలు ఉంటాయని అవగాహన కల్పిస్తున్నారు. తెలియని నంబర్ల నుంచి మెసేజ్‌లు, కాల్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత మెసేజ్‌లు, కాల్స్ వస్తే వెంటనే బ్లాక్ చేయాలని సూచిస్తున్నారు.

అవగాహన, అప్రమత్తత తప్పనిసరి



సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. అప్రమత్తంగా ఉండడంతో పాటు సైబర్ నేరాలను నియంత్రించడానికి మరింత అవగాహన పెంచుకోవాలి. 1930కాల్ సేవలు సద్వినియోగం చేసుకుని సైబర్ మోసానికి గురైనట్లు తెలుసుకుంటే వెంటనే ఫిర్యాదు చేయాలి. మోసానికి గురైన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే మేలు జరుగుతుంది.

- సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ

కలెక్టర్ సార్ చెప్పినా.. జాబితాలో పేరులేదు

- బాధితుల ఆవేదన



కత్రోజు రామాచారి భాగ్యలక్ష్మి దంపతులు,



మద్దినాల లింగన్న

కురవి: 'కలెక్టర్ సార్ ఇంటికొచ్చి పరిశీలించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పినా.. జాబితాలో పేరు లేదు' అని బాధితులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 6న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన మద్దినాల లింగన్న, కత్రోజు రామాచారి ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లు కావాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన ఇళ్లు ఇస్తామని చెప్పినట్లు బాధితులు మద్దినాల లింగన్న, కత్రోజు రామాచారి అయ్యగారిపల్లిలో బుధవారం జరిగిన గ్రామసభలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేకపోవడంతో వారు ఆవేదనతో పంచాయతీ కార్యదర్శి రామునాయక్‌ను అడిగారు. కలెక్టర్ సార్ చెప్పారు.. సార్ జాబితాలో పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామునాయక్‌ను వివరణ కోరగా వారి పేర్లను జాబితాలో తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని, తుది జాబితాలో వారి పేర్లు లేవని తెలిపారు. మరోమారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలోని అన్ని సీట్లు, ఏడు నుంచి పదో తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వరకు గడువు ఉందని, ఓసీ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.120 ఆన్‌లైన్‌లో చెల్లించి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా పోలీసు క్రీడలు




వాలీబాల్ క్రీడలో తలపడుతున్న ఇరుజట్లు



చెంచా పరుగులో..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయ మైదానంలో పోలీసుల క్రీడాపోటీలు రెండోరోజు బుధవారం ఉత్సాహంగా కొనసాగాయి. కబడ్డీ, క్రికెట్, రన్నింగ్, వాలీబాల్, షటిల్, చెస్, క్యారమ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ వివిధ క్రీడలను ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చుసుకున్నారు. తొర్రూరు, మహబూబాబాద్ సబ్ డివిజన్ల పరిధిలోని మరిపెడ, గూడూరు, కొత్తగూడ, డోర్నకల్, కేసముద్రం, నెల్లికుదురు మహిళా పోలీసులు, సిబ్బంది కబడ్డీ క్రీడలో హోరాహోరీగా తలపడ్డారు. సీఐలు, ఎస్సైలు డీఎస్పీలు, ఎస్పీ పలు క్రీడలో పాల్గొన్నారు. హోంగార్డులు కబడ్డీ క్రీడలో తలపడ్డారు. ఈక్రమంలో ఎస్పీ డిజిటల్ కెమెరాతో పలు ఫొటోలు చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు అన్ని క్రీడలు ఆడాలని, క్రీడా నైపుణ్యాలు పెంపొందించడంలో పోలీసులు ముందు వరుసలో ఉంటారన్నారు. గురువారం సాయంత్రం నిర్వహించే బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, డీఎఫ్‌ఓ విశాల్ హాజరవుతారన్నారు.



డిజిటల్ కెమెరాతో ఫొటోలు తీస్తున్న ఎస్పీ

రెండోరోజూ.. అదే లొల్లి

తప్పల తడకగా లబ్ధిదారుల జాబితా

- అర్హుల పేర్లు లేకపోవడంతో అధికారుల నిలదీత
- మళ్లీ దరఖాస్తులు తీసుకొని విచారణ చేయాలని డిమాండ్
- గ్రామ సభలకు వెళ్లేందుకు అధికారుల జంకు..



నడివాడలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

సాక్షి, మహబూబాబాద్/మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పథకాల ఎంపిక కోసం జిల్లా వ్యాప్తంగా రెండోరోజు బుధవారం నిర్వహించిన గ్రామ సభలు మొదటిరోజు మాదిరిగానే రసాభాసగా సాగాయి. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకం లబ్ధిదారుల ఎంపిక జాబితాను అధికారులు ప్రకటించగానే పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. అన్ని అర్హతలు ఉన్న మాకు ఎందుకు ఇల్లు రాలేదు.. రేషన్ కార్డులు రాలేదని అధికారులను ప్రజలు నిలదీశారు. దీంతో ఏం చేయాలో పాలుపోక పలువురు అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోగా.. మిగిలిన అధికారులు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

నిరసనల హోరు..

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని జిల్లాలోని పలు గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభల వద్ద లబ్ధిదారులు ఆందోళన నిర్వహించారు. మహబూబాబాద్ రూరల్ మండలం నడివాడలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అర్హులకు ఇవ్వలేదని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామంలో అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, తమ పేర్లు ఎందుకు తొలగించారని అధికారులను నిలదీశారు. కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హులకు మొండి చెయ్యి చూపించారని జాబితాలో తమ పేర్లు లేవని అధికారులతో గ్రామస్తులు గొడవకు దిగారు. గార్ల మండలం సీతంపేటలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అనర్హులకు పథకాలు వచ్చేలా తప్పుడు నివేదికను ఇచ్చారని మాజీ ఎంపీటీసీ నాగమణి అధికారులను ప్రశ్నించారు. డోర్నకల్ మండలం పెనుపాడు గ్రామంలో అర్హులకు పథకాలు ఇవ్వకుండా అధికారులు, నాయకులు కుమ్మక్కై అనర్హులను లబ్ధిదారులుగా ప్రకటించారని గ్రామస్తులు ధర్నా చేపట్టారు.

ఫలితం ఉంటుందా..

ప్రభుత్వ పథకాల అమలు కోసం ఏర్పాటుచేసిన గ్రామ సభల్లో అధికారులు ప్రకటించిన జాబితాల్లో పలువురు అర్హులకు పథకాలు అందకుండా అనర్హులకు అందేలా జాబితా ఉందని జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారు. కాగా అన్ని అర్హతలను ఉండి.. అర్హుల జాబితాలో పేరు లేకపోతే గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకుంటే రీ సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే ఇప్పటికే అర్హుల జాబితా వచ్చిందని, దరఖాస్తులు చేసుకున్నా వృథా ప్రయాసే తప్ప ఫలితం ఉండదని పలువురు చెబుతున్నారు. దీంతో అన్ని అర్హతలు ఉండి పథకం పొందలేని వారి దరఖాస్తులు మరోసారి పరిశీలించి న్యాయం చేయాలని పలు గ్రామాల ప్రజలు కలెక్టర్‌ను కోరుతున్నారు. రీ సర్వే చేసిన తర్వాతనే తుది జాబితా విడుదల చేయాలని కోరుతున్నారు.

నన్ను ఏ పథకానికీ ఎంపిక చేయలేదు



నిరుపేద కుటుంబానికి చెందిన నేను కూలీ పని చేసుకుని బతుకుతున్నాను. ఉపాధి హామీ పథకం పనికి కూడా వెళ్లాను. నాకు గుంట భూమి లేదు.. అయినా ఏ పథకానికి ఎంపిక చేయలేదు. అర్హత ఉన్న నాలాంటి చాలా మందిని గుర్తించకుండా అధికారులు అన్యాయం చేశారు. డబ్బులు ఉన్నవాళ్లకే అన్ని వస్తున్నాయి. ప్రభుత్వం న్యాయం చేసి ఆదుకోవాలి.

- వెలుగు సారయ్య, కూలీ, నడివాడ

లోపించిన పారదర్శకత..



పథకాల అమలులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన సర్వే పారదర్శకంగా లేదు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలకు అందడం లేదు. సింగారం ప్రాంత ప్రజలకు ఏ ఒక్క పథకం కూడా అమలయ్యే పరిస్థితి లేదు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం రీ సర్వే నిర్వహించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలి.

- దర్శనం బాలకృష్ణ, సింగారం

అధికారులను నిలదీస్తున్న ప్రజలు

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్: సంక్షేమ పథకాల అమలు పేరుతో ఎన్నిసార్లు దరఖాస్తులు ఇవ్వాలని ప్రజలు అధికారులను సభల్లో నిలదీస్తున్నారని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. వార్డు, గ్రామసభల పేరుతో ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పనికి రాని సభలు నిర్వహిస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. అధికార యంత్రాంగాన్ని సభలకు ఉపయోగించి అధికారులను ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారన్నారు. సభలలో ప్రకటించే జాబితా సరైనది కాదని, తమ వద్ద ఉన్నదే అర్హుల జాబితా అని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని ఆవిషయంలో అధికారులు స్పష్టత ఇవ్వాలన్నారు. బోగస్ గ్రామ సభల్లో అధికారులను ప్రజలు నిలదీయాలన్నారు. ముందుగా ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న దగా విషయంలో ప్రశ్నిస్తే కేసులు, దాడులు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు ఎడ్ల వేణుమాధవ్, జెరిపోతుల వెంకన్న, వెంకటాద్రి, రామకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

మహబూబాబాద్ అర్బన్: మైనర్లు వాహనాలు నడిపితే జైలు శిక్ష, రూ. 25 వేల జరిమానా తప్పదని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు, వాహనాదారులకు రవాణాశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తల్లిదండ్రులు కారులో వెళ్లేటప్పుడు సీట్‌బెల్ట్, టూవీలర్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించాలన్నారు. మానవ తప్పిదాలతో ఏటా దేశంలో లక్షలాది మంది రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారన్నారు.

కమ్మేసిన పొగమంచు..

జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. మానుకోట, తొర్రూరు, గూడూరు, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లో 8గంటల తర్వాత కూడా మంచు కమ్ముకొని ఉండటంతో జాతీయరహదారులపై వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్లారు. అలాగే రైల్వేస్టేషన్లలోనూ మంచు కమ్ముకొని ఉండడంతో లైట్ల వెలుతురులో రైళ్ల నెమ్మదిగా రాకపోకలు సాగించాయి.

–సాక్షి, నెట్‌వర్క్



గూడూరులో వెలుతురులో వెళ్తున్న వాహనం



కేసముద్రం రైల్వేస్టేషన్‌లో లైట్ల వెలుతురులో నెమ్మదిగా వెళ్తున్న రైలు



జిల్లా కేంద్రంలోని కురవి రోడ్డులో...



తొర్రూరులో రోడ్డును కమ్మేసిన మంచు

క్లుప్తంగా

28న జాబ్‌మేళా

గూడూరు: ఈ నెల 28న ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీయువకులకు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఏటూరునాగారం ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాకు పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, డీఫార్మసీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదివిన నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వివరాలకు సెల్ 8330954571 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌కు కేయూ మహిళా జట్టు



కేయూ జట్టుతో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్ : మైసూర్ యూనివర్సిటీలో ఈనెల 23నుంచి 28వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేశామని స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య బుధవారం తెలిపారు.ఈజట్టులో ఎం నవ్య (కెప్టెన్), జి మోహనశ్రీ, జె. అనూష ,బి. నవ్య, బి.లీషా, టి. అశ్విత, వి. సుజాత వై.రచిత, ఎం. దాత్రిశ్రీ, పి. సరిత, ఎస్. జయశ్రీ, ఎస్. తుష్మరేఖ, డి. యశస్విని, ఎం. సౌమ్యశ్రీ, పి. శ్రీనిధి, బి. మంజుల ఉన్నారని వెంకయ్య తెలిపారు. ఈ జట్టుకు హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎండి. అఫ్జల్ కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని వెంకయ్య తెలిపారు.

మధుప్రియపై కేసు నమోదు చేయాలి

- దేవస్థానం కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల ధర్నా



కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానం గర్భగుడిలో సింగర్ మధుప్రియ ప్రైవేట్ పాట చిత్రీకరించిన నేపథ్యంలో ఆమెతో పాటు బృందంపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం కార్యాలయం ఎదుట కార్యకర్తలతో బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈఓ, మధుప్రియ, వారి బృంద సభ్యులపై దేవాదాయ శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ, సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత దేవస్థాన అధికారులపై ఉందన్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకు ముందు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, ఆర్జేసీ రామకృష్ణరావుతో ఘటనపై మాట్లాడారు. చర్యలు తీసుకోవాలని విన్నపించారు. మండల అధ్యక్షుడు మనోజ్, కిషన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మళ్లీ నిలబడి..

పన్నెండేళ్లకు ప్రభుత్వ పాఠశాల పునః ప్రారంభం



గుజిలితండా ప్రభుత్వ పాఠశాల



తరగతి గదిలో కూర్చున్న విద్యార్థులు

- 20 మంది విద్యార్థులతో బడికి పూర్వవైభవం
- ఇంగ్లిష్ మీడియం లేదని పిల్లలను పంపని తల్లిదండ్రులు
- విద్యార్థులు లేక 12 సంవత్సరాలుగా పాఠశాలకు తాళం
- గ్రామపెద్దలు, తండావాసుల చొరవతో తెరుచుకున్న స్కూల్

సాక్షి, మహబూబాబాద్: ఇంగ్లిష్ మీడియంలో చదివించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు లేరనే కారణంతో ప్రభుత్వం 12 సంవత్సరాల క్రితం పలు ప్రభుత్వ పాఠశాలలను మూసివేసింది. ఇలా మూసివేతకు గురైన పాఠశాలల్లో మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం గుజిలి తండా ప్రాథమిక పాఠశాల కూడా ఒకటి. ఈ చర్యతో ప్రైవేట్‌లో చదివించే స్థోమత లేకపోవడంతో నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అయితే వారు సరిగా పాఠశాలకు వెళ్లడం లేదు. దీనిని గమనించిన గ్రామపెద్దలు, తండావాసుల చొరవ తీసుకుని తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను ఆ పాఠశాలకు పంపేలా ఒప్పించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే, అధికారులతో మాట్లాడి ఈ నెల 18వ తేదీన బడిని తెరిపించారు. 20 మంది పిల్లలను చేర్పించి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి పాఠాలు బోధించడంతో బడికి పూర్వవైభవం వచ్చింది.

పన్నెండు సంవత్సరాలుగా మూత..

ఇంగ్లిష్ మీడియంలో చదివించాలనే ఆలోచనతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో గతేడాది సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వే ద్వారా సేకరించిన వివరాల ప్రకారం 1,804 పాఠశాలలు విద్యార్థులు లేక మూతబడ్డాయి. ఇందులో అత్యధికంగా 153 పాఠశాలలు మహబూబాబాద్ జిల్లాలోనే ఉన్నాయి. ఇందులో భాగంగానే గుజిలితండా బడి కూడా విద్యార్థులు లేరనే కారణంతో మూసివేశారు. తండాలో 72 గృహాలు, 350 జనాభా ఉంది. తండాకు చెందిన జాటోత్ వీరన్న అనే వ్యక్తి రెండు గుంటల భూమిని దానం చేయగా 1998–1999 అక్టోబర్‌లో 30 మంది విద్యార్థులతో ప్రాథమిక పాఠశాలను నిర్మించి ప్రారంభించారు. 2013 ఏప్రిల్‌లో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండడంతో పాఠశాలను అధికారికంగా మూసివేశారు. అక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు విజయరాణి, సంధ్యను వేరే పాఠశాలలకు బదిలీ చేశారు.

గ్రామపెద్దలు, తండావాసుల చొరవతో

పన్నెండు సంవత్సరాలుగా బడి మూసి వేయడంతో ఆర్థికంగా ఉన్న కుటుంబాలు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపించగా.. నిరుపేదలు తమ పిల్లలు సమీపంలోని కొత్తూరు ప్రభుత్వ పాఠశాలకు పంపించేవారు. అయితే తల్లిదండ్రులు పనికి వెళ్లగా.. పిల్లలు బడికి వెళ్లకుండా ఉండడం.. రోడ్డు వెంట తిరుగుతూ ఉండేవారు. ఇలా తిరుగున్న పిల్లలను గమనించిన కొత్తూరు గ్రామానికి చెందిన మలిశెట్టి వేణు, తండా పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. వారిని తీసుకొని వెళ్లి స్థానిక ఎమ్మెల్యే, డీఈఓను కలిశారు. విద్యార్థులు ఉంటే బడి తెరుస్తామని అధికారులు చెప్పడంతో తండాలోని పిల్లలందరినీ బడిలో చేర్పించి ఈనెల 18న తెరిపించారు. దీంతో దశాబ్దకాలానికి పైగా మూతబడిన బడి ప్రస్తుతం 20మంది పిల్లలు, ఇద్దరు ఉపాధ్యాయులతో మళ్లీ కళకళలాడుతోంది.

బడి ప్రారంభంతో ఆనందం..



తండాలో బడి మూత పడడంతో పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా రోడ్లపైనే ఆడుకునే వారు. తండా పెద్దలు, గ్రామస్తుల సహకారంతో బడిని పునఃప్రారంభించడం ఆనందంగా ఉంది. ఇంగ్లిష్ మీడియంలో చదువు చెప్పడానికి అధికారులు నిర్ణయం తీసుకోవడం పిల్లలకు లాభం కలుగుతుంది.

–జాటోత్ శ్రీను, విద్యార్థి తండ్రి

విద్యార్థులు ఉంటే మూసిన బడులన్నీ తెరుస్తాం



విద్యార్థులు లేని జిల్లాలోని 153 ప్రభుత్వ పాఠశాలను మూసివేశాం. గుజిలితండా ఇతర ప్రాంతాలకు ఆదర్శం కావాలి. తండాలు, గిరిజన గూడేలు, గ్రామాల్లోని పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు వచ్చి పిల్లలను పంపిస్తే బడి తెరిచేందుకు మేం సిద్ధం. ఉపాధ్యాయులను పంపించి ఇంగ్లిష్ మీడియంలో బోధన, ఉచిత భోజనం, పుస్తకాలు, రెండు జతల దుస్తులు అందజేస్తాం.

–రవీందర్ రెడ్డి, డీఈఓ, మహబూబాబాద్

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

- తొలిసెషన్‌లో 1,220 మంది, రెండో సెషన్‌లో 1,225 మంది హాజరు

విద్యారణ్యపురి: జాతీయ విద్యా సంస్థలు ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరగుతున్నాయి. హనుమకొండ, వరంగల్‌లో కలిపి 5 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. హనుమకొండలోని జయ ఇంజనీరింగ్ కళాశాల, హసన్‌పర్తిలోని అయాన్ డిజిటల్ జోన్, భీమారంలోని మోక్షిత కంప్యూటర్స్, భీమారంలోని చింతగట్టు టెక్నాలజీ సొల్యూషన్స్, వరంగల్‌లోని బొల్లికుంట ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రాలుగా ఉండగా పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. మొత్తం 7,542 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. తొలిరోజు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన సెషన్‌లో మొత్తం 1,252మంది అభ్యర్థులకు 1,220మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్ పరీక్షలు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు. మొత్తం 1,259మంది అభ్యర్థులకు గాను 1,225మంది హాజరుకాగా 34 మంది గైర్హాజరయ్యారని జేఈఈ మెయిన్స్ సిటీ కోఆర్డినేటర్ కె. శ్రీలతారెడ్డి తెలిపారు. పరీక్షలకు నిర్దేశించిన సమయం కంటే రెండు గంటల ముందు నుంచే కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు. ఉదయం సెషన్‌లో 8.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు కేంద్రాల గేట్లు మూసివేశారు. అభ్యర్థులు హాల్ టికెట్ అడ్మిట్‌కార్డుతోపాటు ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన సెల్ఫ్‌డిక్లరేషన్, పాస్‌ఫొటో, ఒరిజినల్ గుర్తింపు కార్డులు పరిశీలించిన అనంతరమే అనుమతించారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

- పెద్ది వెంకటనారాయణ



క్రీడాకారులతో పెద్ది వెంకటనారాయణ, తదితరులు

కాజీపేట రూరల్: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని, నేటి ఆధునిక జీవన విధానంలో తగ్గిపోతున్న క్రీడల ప్రాధాన్యత పెంపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్, జనగామ జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో లోకో 11 జట్టు– ఇంజనీరింగ్ జట్టు మధ్య క్రికెట్ పోటీని బుధవారం పెద్ది వెంకటనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి రైల్వే ఉద్యోగులకు కావాల్సిన సహకారం అందిస్తామని తెలిపారు. రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ ఆర్డీఎం జట్టు–రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్ల మధ్య పోటీని ప్రారంభించి మాట్లాడారు. క్రీడలను మానసికోల్లాసమే కాకుండా బాల్యస్మృతులను గుర్తు చేస్తాయన్నారు. క్రీడలతో ఆరోగ్య సమస్యలకు చెక్‌పెట్టొచ్చని అభిప్రాయపడ్డారు. మొదటి మ్యాచ్‌లో రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్టుపై ఆర్డీఎం జట్టుజట్టు గెలిచింది. రెండో మ్యాచ్‌లో లోకో –11 జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్, కల్చరల్ విభాగాల ఇన్‌చార్జ్ దారవత్ రఘు, క్రికెట్ క్రీడల విభాగాల ఇన్‌చార్జ్ పి.ప్రశాంత్, కమిటీ సభ్యులు ఎస్.ప్రవీణ్, పి.రవికిరణ్, సుంచు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష మందితో బీసీ యుద్ధభేరి సభ

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న నిర్వహించనున్న బీసీ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కేయూ దూరవిద్య కేంద్రంలోని జాఫర్ నిజాం సెమినార్‌హాల్‌లో బీసీ విద్యార్థి సంఘాలు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం జరుగుతోందని, అందుకే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. లక్షమందితో జరగబోయే బీసీ యుద్ధభేరి బహిరంగసభకు బీసీలు ఐక్యంగా తరలివచ్చి సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలోని బీసీ విద్యార్థులంతా తరలిరావాలన్నారు. సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మేడారపు సుధాకర్, నరేశ్, బీసీ విద్యార్థి సంఘం బాధ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత దూరవిద్య కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలువేశారు. అంతకుముందు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో సభాస్థలిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతోపాటు వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి, బీసీ నేత సుందర్ రాజు యాదవ్, బీసీ నేతలు, కుల సంఘాల బాధ్యులు పరిశీలించారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

- త్రిదండి చినజీయర్ స్వామి



మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

ఖిలా వరంగల్: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. బుధవారం వరంగల్ ఉర్సు గుట్ట నానిగార్డెన్‌లో వడుప్సా(ట్రస్మా) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అడెపు శ్యామ్, జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా త్రిదండి చినజీయర్ స్వామి హాజరైజ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా విషయ పరిజ్ఞానం తెలుసుకోవాలన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థి సన్మార్గంలో పయనిస్తూ తల్లిదండ్రులు, గురువులను దైవంగా భావించాలన్నారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి మాట్లాడారు. విద్యార్థులు పరీక్ష సమయం వృథా చేయొద్దన్నారు. శ్రద్ధతో చదివి 10/10 గ్రేడ్ సాధించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ప్రతినిధులు కోడెం శ్రీధర్, అంకతి వీరస్వామి, బిల్లా రవి, జ్ఞానేశ్వర్‌సింగ్, సతీశ్, చక్రపాణి, మడిపెల్లి రాజు, కూచన క్రాంతికుమార్, దాసి సతీశ్‌మూర్తి, కిరణ్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..

- చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి

వరంగల్ క్రైం: తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసి నిందితుడి నుంచి సుమారు రూ. 50 వేల విలువైన ఐదు గ్రాముల బంగారు, 61 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయల గూడెం గ్రామానికి చెందిన సన్నిధి ఆంజనేయులు రోజువారీ కూలి పనిచేస్తూ వచ్చే ఆదాయంతో జల్సాలు చేసేవాడు. అయితే జల్సాలకు ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సుబేదారి పీఎస్ పరిధిలోని చిల్డ్రన్స్ పార్క్ ప్రాంతంలో ఇటీవల తాళం చేసి ఉన్న ఇంటిలో ఐదు గ్రాముల బంగారు, 61 గ్రాముల వెండి ఆభరణాలు, రూ. 60 వేల నగదు అపహరించాడు. నిందితుడు గతంలోనూ పలుమార్లు చోరీలకు పాల్పడడంతో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ క్రమంలో బుధవారం మరోసారి చోరీకి పాల్పడేందుకు హంటర్ రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులకు అనుమానం వచ్చింది. అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్..

చైన్‌స్నాచర్‌ను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.3.60 లక్షల విలువైన 45 గ్రాముల బంగారు గొలుసుతో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండల కేంద్రానికి చెందిన ములక విజయ్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం కొత్తూరు జెండా ప్రాంతంలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలు హనుమకొండ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన హనుమకొండ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా.. టెక్నాలజీ సాయంతో నిందితుడి ఆచూకీ కనిపెట్టి అరెస్ట్ చేసి చోరీ చేసిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితుడు ఖమ్మం, జనగామ, వరంగల్, కాజీపేట, పర్వతగిరి, సుబేదారి పోలీస్ స్టేషన్ల పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

మిలిటరీ వ్యూహాల్లో టెక్నాలజీ కీలకం

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: మిలటరీ వ్యూహాల్లో కంప్యూటర్ టెక్నాలజీ కీలక భూమిక వహిస్తుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. బుధవారం యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆవిభాగం సెమినార్‌హాల్‌లో నిర్వహించిన 'టూ వీక్స్ ఇంటెన్సివ్ ప్రోగ్రాం ఫ్రమ్ ఎక్సెల్ టూ పవర్ బీ ఫర్ ఎన్‌సీసీ జవాన్స్' ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలద్వారా ఇంజనీరింగ్, కంప్యూటర్ నైపుణ్యాలు మెరుగుపడుతాయన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి రమ మాట్లాడుతూ.. రెండు వారాల పాటు రోజూ ఉదయం రెండు గంటలు థియరీ, సాయంత్రం రెండు గంటలు ప్రాక్టికల్స్ కృత్రిమ మేధా, ఎక్సెల్ పవర్ బీ ఐ డేటా అనాలిసిస్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సింథల్ రామదురై మాట్లాడుతూ.. రెండు వారాల శిక్షణద్వారా సామర్థ్యాల పెంపు, వాల్యూ అడిషన్ జరగుతుందన్నారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేశ్‌లాల్, బీఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ మంజుల, డాక్టర్ రమేశ్, డాక్టర్ నీలిమ, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రవి, సునేహార్ విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

ఎంజీఎం : వరంగల్ జిల్లా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న 104 కాంట్రాక్ట్ ఉద్యోగులకు గత ఆరు నెలలుగా వేతనాల అందక అవస్థలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే వారి పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయూఎంహెచ్ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు 104 ఉద్యోగులతో కలిసి బుధవారం నల్ల రిబ్బన్ ధరించి డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యాదనాయక్ మాట్లాడుతూ.. 104 ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 33 జిల్లాలకు ఆరు నెలలకు సంబంధించిన బడ్జెట్ విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఉద్యోగులకు చెల్లింపు పూర్తయినా.. ఒక్క వరంగల్ జిల్లాలోనే వేతనాలు విడుదల చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు మూడు రోజుల్లో విడుదల చేయాలని లేకపోతే ఈనెల 27న వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో 104 ఉద్యోగులు పర్లపల్లి శ్రీనివాస్, రాజ్‌కుమార్, సృజన, మధు, క్రాంతికుమార్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

దేవుని గుట్టపై రాతి కట్టడాలు



పంచముఖ పువ్వు, గుర్రం తల, కోట గడి మెట్లు



రాతి కట్టడాలను చూపుతున్న పరిశోధన బృందం

- గుర్తించిన పరిశోధన బృందం

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం బంధాల అటవీ ప్రాంతంలోని దేవుని గుట్టపై పురాతన రాతి కట్టడాలను గుర్తించినట్లు పరిశోధన బృందం సెంటర్ డైరెక్టర్ కాక నర్సింగారావు, అసోసియేట్ డైరెక్టర్ కొర్నెబెల్లి గణేశ్ తెలిపారు. బంధాల అభయారణ్యంలో దేవుని గుట్టపై పురాతన కోటను బుధవారం కామారం సమ్మక్క, సారలమ్మ ఆర్కియాలజీ ఇండిజినస్ పరిశోధనా బృందం సందర్శించింది. పురాతన కోటలను రాజ్య పాలన ఆనవాళ్లు, పురావస్తు వస్తువులను గుర్తించినట్లు బృందం సభ్యులు వెల్లడించారు. గుట్ట కింద మూడు కిలోమీటర్ల విస్తరణలో గుట్టను ఆనుకుని కోట గడి నిర్మాణం చేశారన్నారు. దీని పరిధిలో పురాతన శివలింగం, నంది నాగుపాము బొమ్మలు, ధ్వంసమైన చిన్న ఆలయం ఉందన్నారు. శిథిలాలలో ఉన్న రాళ్లపై లిపిని అధ్యయనం చేయగా నాలుగు పలకల బండలపై నాలుగో గొట్టును తెలియ చేసే నాలుగు గుర్తులు, రాజ్య ముద్ర దీర్ఘ చతురస్రాకారం బండపై చెక్కారన్నారు. ఇంకొక చిన్న కోట గడిలో ఇప్ప చెట్టు కింద గుర్రం తల పోలిన రాయిపై ఐదు డబ్బాలు సమ్మక్క తల్లి అయిదో గొట్టు అని తెలుపగా ఇంకొక పక్క నాలుగు డబ్బాలు నాలుగు గొట్టు కోడలునీ తెలియ చేస్తుందన్నారు. ఇది సింధు నాగరికతలో మోనో లోగో శిలబిక్ రూపంలో ఒక కొమ్ము దుప్పిని పోలిన ఆకారంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. నాగులమ్మ పడిగా బొమ్మ, నెమలి ఈకలు పెట్టుకున్న మహిళ బొమ్మ గుర్తించామని, రాయిపై ఈ కోట ఎలా ఉందనే విషయంపై మ్యాప్ కూడా గుర్తించామన్నారు. పెద్ద రాళ్ల సాయంతో అయిదు వందల మీటర్ల దీర్ఘ చతురస్రాకారంలో ఈ కోట గడి ఉందన్నారు. దీని లోపల 60 పురాతన రోళ్లను గుర్తించామన్నారు. పురాతన రాజ్యాల ప్రజలు ఇక్కడ వడ్లు దంచేవారన్నారు. ఈ కోటకు నాలుగు పక్కల ద్వారాలు ఉన్నాయన్నారు. నీటి బావి నీటి గోళాలు, ఇంటి స్థలం, వస్తూ సామగ్రి ఆనవాళ్లను గుర్తించినట్లు తెలిపారు. గుట్ట కింద కూడా 98 మీటర్ల పొడవు 15 మీటర్ల వెడల్పులో రచ్చ బండ ఉందన్నారు. ఇందులో కూర్చోవడానికి 56 రాళ్లు నాలుగు వరుసలుగా ఉన్నాయన్నారు. కానీ గుప్త నిధుల పేరిట నిత్యం పురాతన కట్టడాలను ధ్వంసం చేస్తున్నారని గుర్తించామన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి రక్షణకు కృషి చేయాలన్నారు.

రూ.24.45 కోట్లతో కాజీపేట జంక్షన్ అభివృద్ధి

- అమృత్ భారత్ పథకంలో భాగంగా శరవేగంగా సాగుతున్న పనులు
- వివరాలు వెల్లడించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు



పనుల తర్వాత ఉండే కాజీపేట జంక్షన్ నమూనా

కాజీపేట రూరల్: 19వ శతాబ్దం నిజాం కాలంలో నిర్మించిన కాజీపేట జంక్షన్‌ను రైల్వేశాఖ అమృత్ భారత్ స్టేషన్ పథకానికి ఎంపిక చేసి రూ.24.45 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తోంది. ఈ మేరకు బుధవారం కాజీపేట జంక్షన్ రీడెవలప్‌మెంట్ పనుల వివరాలను రైల్వే అధికారులు విలేకరులకు వెల్లడించి మాట్లాడారు. భారతీయ రైల్వేలో ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు అందించాలనే దృక్పథంతో భారీ స్థాయిలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కాజీపేట జంక్షన్‌లో చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణలో 2023 ఆగస్టు, 2024 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ.. రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. భారత రైల్వే మంత్రిత్వ శాఖ రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం, దీర్ఘకాలిక దృష్టితో నిరంతర ప్రాతిపదికన అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అమృత్‌భారత్ స్టేషన్ స్కీమ్‌ను రూపొందించినట్లు తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్ రూ.41.36 కోట్ల వార్షిక ఆదాయంతో సగటున రోజుకు 24,269 మంది ప్రయాణికులకు సేవలందిస్తోందని, ఇక్కడ దాదాపు 98 రైళ్లకు హాల్టింగ్ ఉందన్నారు. అన్ని సౌకర్యాలతో ఇప్పటి వరకు 40 శాతం పనులు పూర్తయ్యాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cell: 8341479342. [WA-7552]

డాక్యుమెంట్స్ పోయినవి

■ మణికంటి దేవేందర్ రెడ్డి, S/o. Late M. వెంకట్ రెడ్డి, ఇ.నెం.61-1-73, గ్రా॥ కొత్తపల్లి, మం॥ కాజీపేట్, జి॥ హన్మకొండ గారి ఒరిజినల్ ల్యాండ్ Sy.No. 342/A, డాక్యుమెంట్ నెం. 6368/2002 గలవి బైక్‌పై కొత్తపల్లి నుండి కాజీపేట్‌కు వస్తుండగా తేది: 30-12-24న దారిలో పడిపోయినవి దొరికినవారు తెలుపగలరు. [W-1264199]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మర్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్. [SCA25001311]

WANTED

■ మా అపార్ట్‌మెంట్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ సూపర్‌వైజర్స్ వాచ్‌మెన్స్ కావలెను. సంప్రదించండి. 9491706517 [SCA25001270]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ రిసెప్షనిస్ట్ టెలికాలర్స్ మార్కెటింగ్ అకౌంటెంట్స్ కంప్యూటర్ ఆపరేటర్ డేటా ఎంట్రీ కావలెను. 9491706517, 9491710857 [SCA25001276]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256044]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.